క్లుప్తంగా

గోదావరికి వరద పోటుతో విలీన మండలాల్లో ఆందోళన

కుక్కునూరు : అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో ఏజెన్సీ గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. మరోపక్క ఎగువ నుంచి వస్తున్న వరదతో గోదావరికి వరద పోటు పెరుగుతుంది. భద్రాచలం వద్ద గోదావరి వరద బుధవారం రాత్రి 34 అడుగులకు చేరుకుంది. కాగా పెరుగుతున్న వరదతో కుక్కునూరు, వేలేరుపాడులలోని వాగుల్లోకి వరద నీరు పోటెత్తి వంతెనలు ముంపు బారిన పడే అవకాశం ఉంటుంది. మరో రెండు రోజులు వర్షాలుంటాయన్న ఐఎండీ హెచ్చరికలతో గోదావరి వరద ఏ స్థాయిలో వస్తుందోనన్న ఆందోళన విలీనమండలాల్లో నెలకొంది.

ప్రజల ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలి

దెందులూరు: అలుగులగూడెం- దెందులూరు మధ్య ఉన్న అండర్ పాస్ నిర్మిస్తున్న నేపథ్యంలో ఆ మార్గం గుండా వెళ్లే అన్ని గ్రామాల ప్రజల ప్రయాణ అవసరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైల్వే కాంట్రాక్టర్‌ను తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య ఆదేశించారు. బుధవారం వర్షం కారణంగా ఏర్పడిన బురదలో వివిధ గ్రామాల ప్రజలు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణానికి పడుతున్న ఇబ్బందులను అలుగులగూడెం వార్డు మెంబరు ప్రసన్నరాణి, రాణి, తదితరులు తహసీల్దార్‌కు వివరించారు. వెంటనే తహసీల్దార్ రైల్వే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి ప్రస్తుతం ఉన్న రోడ్డు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేగవంతంగా అండర్‌పాస్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పద్మశాలీల సంఘ మహాసభను జయప్రదం చేయాలి

ఉంగుటూరు: వచ్చేనెలలో భీమడోలులో నిర్వహించనున్న పద్మశాలీల సంఘ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా సంఘం నాయకుడు, రాష్ట్ర వర్కింగు అధ్యక్షుడు వానపల్లి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపురంలో ఉంగుటూరు నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామం వెళ్లి చేనేత కార్మికుల్లో చైతన్యం నింపాలని కోరారు. మండలాలకు బాధ్యులను నియమించామన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కుల సంఘాల రిజిస్ట్రేషన్ల విషయంలో రజక వృత్తిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రజక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో రజక వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లాలు విడిపోవడం వల్ల కొన్ని గ్రామాలు మారి రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది ఎదురౌతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు రిజిస్ట్రేషన్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రజకుల చెరువులను సర్వే చేయించి హద్దు నిర్ణయించాలని, పాడైపోయిన రజక విశ్రాంతి భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రజక నేతలు విఠాల శ్రీనివాసరావు, కడెల్లి సుబ్బయ్య, కవులూరి సూర్యచంద్రం, కోటిచుక్కల అప్పారావు, టేకు కృష్ణవేణి, కొండపల్లి సత్యనారాయణ, దువ్వాపు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

ఏలూరు (టూటౌన్) : జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలని, దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యనాయకుల సమావేశం పి.ఆనందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చెరువల తవ్వకాల వల్ల తాగు నీరు కలుషితమైపోతుందని, పంట చేలు చౌడు బారుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆక్వా చెరువులు తవ్వుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ల సేవలు

కించపరచడం సరికాదు

నా పేరు ఎస్ సత్యవతి. మాది ప్రగడవరం. గతంలో పెన్షన్ కోసం ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లి రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. నేను గతంలో అనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు వేగవరం ఆసుపత్రిలో చేర్చారు. పెన్షన్ ఎలా తెచ్చుకోవాలా అని మదన పడుతుంటే మా వలంటీర్ దూదిగం రవీంద్ర నేను చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందచేశాడు. అప్పుడు నాకు చాలా సంతోషంగా అనిపించింది. వలంటీర్ సేవలను జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ కించపరచడం సరికాదు.


ఐరిష్ తీసుకుని పింఛన్ అందచేస్తున్న వలంటీర్

సంతృప్తికరంగా ఉంది

నా పేరు కొమరం రత్నాల రాజు. వలంటీర్‌గా సేవలందిస్తున్నాను. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెం గ్రామానికి చెందిన కాకర్ల నారాయణమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ తన కుమార్తె ఇంటికి తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి వెళ్లి అక్కడే వైద్యం చేయించుకుంటుంది. సుమారు 65 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసి ఆమెకు పింఛను అందజేసి వచ్చాను. అప్పుడు నాకు ఎంతో సంతృప్తిగా అనిపించింది.


సత్తుపల్లి వెళ్లి నారాయణమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రాజు

వలంటీర్ల సేవలు.. వెలకట్టలేం



వలంటీర్లు అందించే సేవలపై ప్రజలందరు సంతృప్తిగా ఉన్నారు. గోదావరి వరదల సమయంలో నేను నా కుటుంబంతో సహా పునరావాస సహాయక శిబిరాల్లో తలదాచుకున్నప్పుడు మా వలంటీర్ నాయుడు వెంకటరమణ అన్ని నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, మరోపక్క పింఛన్ పంపిణీ చేయడం వంటివి చేశారు. వారికి అప్పచెప్పిన పనిని నిస్వార్థంగా పూర్తి చేసే వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వారి సేవలు వెలకట్టలేనివి.

– విలాసాగరపు నాగరాజు , కుక్కునూరు

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమ లబ్ధి


జంగారెడ్డిగూడెం రూరల్ : ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


ద్వారకాతిరుమల : కౌలు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


కామవరపుకోట : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్


చింతలపూడి : లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న దశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను గ్రామస్థాయికి ప్రభుత్వం చేరువ చేసిందన్నారు. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే తహసీల్దార్ కార్యాలయానికి, పెన్షన్ కావాలంటే మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అన్ని రకాల సేవలు గ్రామంలోని సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యరమాల సత్యవతి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పొడపాటి నందిని, మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్, సొసైటీ చైర్మన్ వీరంకి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయడమే లక్ష్యం

ద్వారకాతిరుమల : అర్హుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని, సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని పంగిడిగూడెంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన పలువురు లబ్ధిదారులకు కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, రేషన్, కౌలు కార్డులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పాలనను సాగిస్తున్నారని అన్నారు. ముందెన్నడూ లేని విధంగా అర్హులను గుర్తించి మరీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, డీసీఎంఎస్ డైరెక్టర్ జేపీ కృష్ణారెడ్డి, గుమ్మడి శ్రీను, బొండాడ వెంకన్నబాబు, ద్వారకాతిరుమల సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బిరుదుగడ్డ చల్లారావు తదితరులున్నారు.

అందరికీ లబ్ధి చేకూర్చేందుకే..

కామవరపుకోట : అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యం అని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలో తడికలపూడి సచివాలయం-1 లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన 810 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు ఈవోపీఆర్డీ జీడి శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఎం.రాజు, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మిడతా రమేష్, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, ఉప సర్పంచ్ కోలా విష్ణు, అధికారులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మేలు

చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని లింగగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, సర్పంచ్ ప్రభావతి, తహసీల్దార్ కృష్ణ జ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొరుటూరులో సురక్ష

పోలవరం రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు పూర్తిగా చేరువ అయ్యాయని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం కొరుటూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్‌లను గుర్తించడం జరిగిందని, వాటిని ఈ కార్యక్రమం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కలం హేమకుమారి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మతంగూడెంలో సురక్ష

లింగపాలెం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం అద్భుతమైన పథకం అని మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు అన్నారు. బుధవారం మతంగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ప్రసాద్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ నవీన్‌బాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కె రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇప్పలపాడులో సురక్ష

బుట్టాయగూడెం : మండలంలోని బుట్టాయగూడెం -2 సచివాలయ పరిధిలోని ఇప్పలపాడులో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్ రావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట జీసీసీ కార్పొరేషన్ మెంబర్ తెల్లం చిన్నారావు, ఎంపీటీసీ తెల్లం రమణ చేతుల మీదుగా అర్హులైన వారికి ఉచితంగా సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం సమీపంలో మొక్కలు నాటారు.

తెడ్లంలో సురక్ష

టి.నరసాపురం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు అన్నారు. మండలంలోని తెడ్లం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, 25 మందికి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి మధు, శ్రీనురాజులతో పాటు ఎంపీటీసీ బండి సుబ్బారావు, సర్పంచ్ ముప్పన స్రవంతి, ప్రత్యేకాధికారి సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో మంగాకుమారి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కుక్కునూరు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పోలవరం ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తొండిపాక సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, గణపవరం సర్పంచ్ తుర్సం నరేష్, ఉప సర్పంచ్ ఎల్లంకి లక్ష్మణ్‌రావు, తొండిపాక ఉపసర్పంచ్ సంతోష్‌రెడ్డి స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరావు, తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, వీఆర్‌ఓ ఇబ్రహీం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిప్పకాయలపాడులో సురక్ష

కొయ్యలగూడెం : దిప్పకాయలపాడులో ఎంపీడీవో ఆర్ బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 200లకు పైగా అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన కాకరపర్తి సావిత్రి అనే మహిళకు పొలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్‌ని ఇవ్వడంతో వృద్ధురాలు ఆనందంతో కన్నీటి పర్యంతమై జగనన్న చిత్రపటాన్ని ఆలింగనం చేసుకున్నారు. పొలం పట్టా ఉన్నప్పటికీ పొజిషన్ సర్టిఫికెట్ లేక ఎన్నో ఏళ్లుగా బాధలు అనుభవించానని ఆమె పేర్కొంది. ఇటువంటి సుదీర్ఘ సమస్యలకు జగనన్న సురక్ష వేదిక అయినందుకు దరఖాస్తుదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ సున్నం శాంతకుమారి, సొసైటీ అధ్యక్షురాలు గొడ్డటి రాణి, మండల కన్వీనర్ జి.నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ తేలే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


దిప్పకాయలపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


పోలవరం రూరల్ : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి, ఐటీడీఏ పీవో సత్యనారాయణ


లింగపాలెం : మతంగూడెంలో ధ్రువపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మండలపు సాయిబాబు


బుట్టాయగూడెం : ఇప్పలపాడులో మొక్కలు నాటుతున్న దృశ్యం


టి.నరసాపురం : తెడ్లంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి మధు


కుక్కునూరు : తొండిపాకలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ ప్రమద్వర

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి

కొయ్యలగూడెం : పదో తరగతి పరీక్షలలో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన బయ్యనగూడెం గ్రామానికి చెందిన విద్యార్థికి బుధవారం దాతలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. బయ్యనగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన కె.రమ్య పదో తరగతి పరీక్షలలో 574 మార్కులు సాధించడమే కాకుండా ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో కూడా సీటు సాధించింది. విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ హైస్కూల్ స్థలదాత వంశపారంపర్యులైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు రూ. 20 వేలు అందజేయగా ఉపాధ్యాయుల బృందం కూడా రూ.10 వేలు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్ తెలిపారు.


రమ్యకు నగదు బహుమతి అందిస్తున్న తాతారావు

ఐటీడీఏ వద్ద ఆదివాసీ గిరిజనుల ధర్నా

బుట్టాయగూడెం : గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు పట్టాలివ్వాలని కోరుతూ బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆ సంఘ రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు ఏ.రవి మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం 2006 ప్రకారం పట్టాలివ్వాలని కోరారు. అలాగే గ్రామ సభలు నిర్వహించడానికి రూట్ మ్యాప్ ప్రకటించాలని అన్నారు. గిరిజనులు సాగులో ఉన్న ఎల్‌టీఆర్ భూములు అన్నింటిని సాగులో నమోదు చేయడానికి అధికారులు, ప్రజాసంఘాల నాయకత్వంలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు నాగమణి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, నాయకులు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఇద్దరు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: అప్పారావుపేటలో బుధవారం పేకాడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీపీ

కొయ్యలగూడెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీని) ఎంపీపీ గంజిమాల రామారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో నెలకొని ఉన్న వసతులు, సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. పాత భవనం నుంచి నూతనంగా నిర్మించిన భవనంలోకి పీహెచ్‌సీని మార్చడం వలన కొన్నిచోట్ల అరకొర వసతులు ఉన్నాయని రోగులు పేర్కొన్నారు. కావాల్సిన సిబ్బంది రిక్రూట్‌మెంట్ గురించి వైద్యాధికారులు ఈ సందర్భంగా ఎంపీపీకి తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎంపీపీ తెలిపారు. వైద్యాధికారులు ఎస్తేరు రాణి, అబ్దుల్ తస్లీమా, ఎంపీహెచ్ఈఓ రామరాజు తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

కలెక్టరేట్ ఉద్యోగికి నివాళులు

ఏలూరు (మెట్రో) : ఏలూరు కలెక్టరేట్‌లో విధులు నిర్వహించుకొని తిరిగి ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన కలెక్టరేట్ ఈ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ జి.సాయినాథ్‌కు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, కలెక్టరేట్ సిబ్బంది ఒక నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయినాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జేసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ మోటారు సైకిల్ నడిపే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండి హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. ఇటువంటి ఘటన పునరావృత్తం కాకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. సాయినాథ్‌కు నివాళులు అర్పించిన వారిలో కలెక్టరేట్ ఏఓ బి.రమాదేవి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చల్లన్నదొర, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ ఎండీ నజీముల్లాషా, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సిబ్బంది ఉన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా


చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తోన్న వైద్యులు

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో తలసేమియా చిన్నారులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారికి ప్రత్యేకంగా అందించాల్సిన చికిత్సను రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తోందని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది చిన్నారులకు తలసేమియా రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టు మాణిక్యాలరావు, సభ్యులు పద్మజ, డీసీఎస్ మల్లేశ్వరరావు, సీహెచ్ అవినాష్ తలసేమియా చిన్నారులను పరామర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రి, సహాయకులు 30 మందికి మానవత విద్యనిధి, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజన సదుపాయాన్ని అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకరరావు పాల్గొన్నారు.